క్లుప్తంగా

నిడమర్రు రైల్వే గేటు మూసివేత

మంగళగిరి: పట్టణంలోని నిడమర్రు రైల్వేగేటును అధికారులు మూసివేశారు. నిడమర్రు రోడ్డు విస్తరణ నేపథ్యంలో గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. పనులు కొనసాగుతుండడంతో గురువారం నుంచి ముందస్తు సమాచారం లేకుండా గేటు మూసివేతతో.. వాహనదారులు గేటు వద్దకు చేరుకుని, వెనుతిరుగుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మంగళగిరి: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు విద్యార్థులకు సూచించారు. కురగల్లు గ్రామంలోని అమృత యూనివర్శిటీ విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ వై శ్రీనివాసరావు కోరారు. సైబర్ నేరగాళ్లు విద్యార్థులను అనేక విధాలుగా మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తెలియని ఫోన్ నంబర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎస్ఐ సీహెచ్ వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిర్రావూరులో పారిశుద్ధ్య పనులు



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిరూరల్ : చిర్రావూరు గ్రామంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్ని రహదారుల్లో వెంటనే డ్రెయినేజీ పూడిక తీయించారు. మురుగునీరు పారేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో సచివాలయం శానిటేషన్ సెక్రటరీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. అనంతరం బ్లీచింగ్ పిచికారీ చేసి దోమల మందు పిచికారీ చేయించారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపంపై.. సాక్షిలో కథనం రావడంతో కమిషనర్ వెంటనే స్పందించారు.

రేపు రక్తదాన శిబిరం

మంగళగిరి: మాజీ సీఎం ఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్య సమాచార నమోదు తప్పనిసరి



ఫిరంగిపురం: విద్యార్థుల ఆరోగ్య సమాచారం తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని జిల్లా పీవో ఎన్‌సీడీ వైద్యాధికారి రోహిణి రత్నశ్రీ అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని వేమవరం ఎంపీపీ హెడీ పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న స్కూల్ హెల్త్ ప్రోగ్రాంను గురువారం రోహిణి రత్నశ్రీ పరిశీలించారు. ప్రతి పాఠశాలలో ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థి ఆరోగ్య సమాచారం, పండ్లు, రక్తహీనత , బరువు, ఎత్తు వంటివి నమోదు చేయాలని చెప్పారు. తగిన సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాంలో భాగంగా సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. భవిత పాఠశాలలో బోధన తీరు, ఆరోగ్య సంబంధిత విషయాలు పరిశీలించారు. ఆమె వెంట జిల్లా ఎన్‌సీడీ కన్సల్‌టెంట్ డాక్టర్ గిరిధర్, వైద్యులు ఫరీనా బేగం, శ్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

తాడికొండ: ఆర్థిక సమస్యలతో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బండారుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోలాపురి శంకరావు (45) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక సమస్యలు పెరిగిపోవడంతో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సాయంతో అతనిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడు భార్య జోలాపురి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

మందకొడిగా పన్ను వసూళ్లు

- డిసెంబర్ ముగుస్తున్నా యాభై శాతం కూడా చేరని లక్ష్యం
- పన్నుల డిమాండ్ రూ 43.27 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.21.50 కోట్లే
- వసూలు కావాల్సింది రూ.21.77 కోట్లు
- నెలాఖరు లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు



మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం ముగింపు దశకు వచ్చినా ఇంత వరకు డిమాండ్‌లో 50 శాతం కూడా పూర్తి కాలేదు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నా.. గృహ, వాణిజ్య సముదాయాల యజమానుల నుంచి స్పందన కరువైంది. పట్టణంలో దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఫోన్‌లు చేయించి మరీ పన్ను బకాయిలను గుర్తుచేస్తున్నారు.

రెవెన్యూ విభాగ నిర్లక్ష్యం..

ఎంటీఎంసీ పరిధిలో 47,637 గృహాలు, 5,764 వాణిజ్య సముదాయాలున్నాయి. మొత్తం 50 వార్డుల్లో 3 లక్షల మంది జనాభా నివశిస్తున్నారు. ఇందులో 40 సచివాలయాల వారీగా పన్ను లక్ష్యాన్ని విధించి, సిబ్బందితో వసూలు చేస్తున్నారు. వార్డులు వారీగా సిబ్బందిని బృందాలుగా నియమించి.. పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి వారం సమీక్షలు నిర్వహించి, వసూళ్లను వేగవంతం చేయడంతో కొద్ది రోజులుగా పన్ను చెల్లింపులు పెరుగుతున్నాయి. సాధారణంగా నగర పాలక సంస్థలో పన్నుల వసూళ్లకు రెవెన్యూ విభాగం ఎంతో కీలకం. ఈ విభాగం వార్డు సచివాలయ సిబ్బందిపై భారం నెట్టేస్తూ..వారిపై అజామాయిషీ చేస్తూ చేతులు దులుపేసుకుంటున్నారు.

50 శాతం కూడా పూర్తి కాని వైనం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నాయి. ఆస్తి పన్ను వసూలు 45శాతం, ఇతర పన్నులు వసూలులో 25 శాతం లోపే పురోగతి కనిపిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.38.67 కోట్ల పన్ను వసూళ్లు సాధించగా.. ఈ ఏడాది మొత్తం రూ 43.27 కోట్ల డిమాండ్‌కు గాను ఇప్పటి వరకు రూ.21.50 కోట్లు మాత్రమే పన్నులు కార్పొరేషన్ ఖజానలో చేరాయి. ఇంకా రూ.21.77 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్...

పన్నుల వసూళ్లకు కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక బృందాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. పాత బకాయిలకు ఒన్ టైమ్ సెటిల్మెంట్ కింద వడ్డీ రాయితీ ఇస్తోంది కార్పొరేషన్. డిసెంబర్ నెలాఖరులోపు పన్ను చెల్లించిన వారికి వర్తింపజేస్తోంది. అలాగే ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఏప్రిల్ నెలలో చెల్లిస్తే 5 శాతం మేరకు పన్ను రాయితీ ప్రకటించింది.

వసూళ్లపై ప్రత్యేక దృష్టి



పన్నుల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అధికారులు, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా నియమించి వసూలు చేస్తున్నాం. పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని మైకులు పెట్టి ప్రచారం నిర్వహిస్తున్నాం.

– అలీం బాషా కమిషనర్, ఎంటీఎంసీ

కేఎల్‌యూలో భౌతిక శాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసిన కేఎస్ జగన్నాథరావు, కె.స్వప్న, కృష్ణారెడ్డి, ఎస్. షణ్ముగన్

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, సదస్సు చైర్మన్ డాక్టర్ కె.స్వప్న, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సుకు దేశ విదేశాలకు చెందిన పలువురు భౌతిక శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా ఇజ్రాయేల్‌లోని ఎరియల్ యూనివర్శిటీ పరిశోధకుడు డాక్టర్ కె.చిన్నయ్య, అమెరికా నుంచి జాలాది ప్రసాద్ పాల్గొన్నారు. సదస్సు చైర్మన్ డాక్టర్ కె.స్వప్న మాట్లాడుతూ విద్యుత్ నిల్వలకు నానో టెక్నాలజీ సామర్థ్యం, మెరుగు పరచడంపై పరిశోధనలు.. దానిపైన చర్చలను ప్రోత్సహించడం ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు. నానో టెక్నాలజీ పాత్రపై దృష్టి సారించడం ద్వారా అధునాతన సూక్ష్మ పదార్థాలను ఉపయోగించి, బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు వంటి విద్యుత్ నిల్వ వ్యవస్థల పనితీరు మరింత స్థిరమైన శక్తి నిల్వ పరిష్కారాలకు దోహదపడే ఆవిష్కరణలను నడపడం ప్రధాన ఉద్దేశమన్నారు. కన్వీనర్ డాక్టర్ షణ్ముగన్ మాట్లాడుతూ ప్రపంచ ఇంధన సవాళ్లను పరిష్కరించేటప్పుడు పర్యావరణంపై దుష్పలితాల ప్రభావాన్ని తగ్గించే స్థిరమైన సూక్ష్మ పదార్థాలను అభివృద్ధి చేయడంపై గురించి అవగాహన కల్పించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, ఎఫ్‌డీఈ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌డీ డీన్ మాధవ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 79 అర్జీలు



ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ పరిధిలో అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి 66 అర్జీలు, భూమి కొలతలకు సంబందించి 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ హామీ అమలు చేయాలి



తాడేపల్లిరూరల్ : ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీపీఎం తాడేపల్లి రూరల్ కమిటీ సమావేశం కాజా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యంగా వేలాది మంది ఇళ్ల పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాడేపల్లి రూరల్ గ్రామాల్లో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, గ్రామాల్లో మురుగు పారే సదుపాయం లేక దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, మలేరియా డెంగీ లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి వీధిలో మద్యం ఏరులై పారుతోందని, తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, ఎం. కిషోర్, కె.యశోద, కె. సాంబశివరావు, జి. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాలను సాధించాలి



అధికారులు, సర్పంచ్‌లతో ఎంపీడీవో కె.సమతావాణి



శిక్షణలో పాల్గొన్న సిబ్బంది, సర్పంచ్‌లతో తుళ్లూరు ఎంపీడీవో కె.శిల్ప

తాడికొండ: గ్రామ పంచాయతీలు ప్రభుత్వ నిర్దేశిత సుస్థిర లక్ష్యాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకింగ్‌లతో ముందు కెళ్లాలని ఎంపీడీవో కె.సమతావాణి అన్నారు. తాడికొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, స్థానికీకరణపై సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ సదస్సు ముగింపు సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుస్థిర అభివృద్ధి సాధించిన లక్ష్యాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అందుకు సంబంధించిన సంపూర్ణ సమాచారం శిక్షణలో తెలియజేయడం జరిగిందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. శిక్షకులు ఏపీఎం సాంబశివరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రవికుమార్, హెల్త్ అధికారి సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కళావతి, కార్యదర్శి లీలా ప్రసన్న, డీపీఆర్‌సీ అనురాధ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

■ తుళ్లూరురు మండలంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గత నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణ సమావేశం గురువారంతో ముగిసింది. గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి కోసం పాటించాల్సిన 9 అంశాలపై ఈ శిక్షణ సమావేశంలో వివరించారు.

రెచ్చిపోతున్న చిల్లర దొంగలు

కారు అద్దం పగలగొట్టి ఎల్ఈడీ సెట్ అపహరణ



పగలకొట్టిన కారు అద్దం



చోరీకి గురైన ఎల్ఈడీ స్క్రీన్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజురోజుకి చిల్లర దొంగతనాలు ఎక్కువై ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బకింగ్ హామ్ కెనాల్ రైల్వే బ్రిడ్జి వద్ద ఇంటి ముందు సూరగాని రవికుమార్ తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కారు పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. ఉదయం 8 గంటలకు కార్ క్లీన్ చేద్దామని వచ్చే సరికి.. కారు డిక్కీ పక్కనే ఉన్న విండో అద్దం పగలగొట్టి ఉంది. లోపలకు దూరి కారులో ఉన్న ఎల్‌డీఈ స్క్రీన్ దొంగిలించారు. ఎల్ఈడీ స్క్రీన్ రూ.30 వేలు, కొత్త అద్దం, ఇతర సామగ్రితో కలిపి మరో రూ.20 వేలు అవుతుందని బాధితుడు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జేవీ చికెన్ సెంటర్ కోళ్ల సరఫరా లారీలో బ్యాటరీ చోరీ చేయడం, మరునాడే మరో ఘటన జరగడంతో తాడేపల్లి ప్రాంత వాసులు భయాందోళనకు లోనవుతున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

టీఎంసీఏ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

తెనాలి రూరల్: ది తెనాలి మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఘంటా నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, కార్యదర్శిగా డాక్టర్ కె. శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శిగా డాక్టర్ జి. కోటేశ్వరప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ కె. శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు అధికారులుగా డాక్టర్ వి. శేషగిరిరావు, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ ఎం.వి. సత్యనారాయణ వ్యవహరించారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, జిల్లా నాయకులు నాయుడు నాగేశ్వరరావు అన్నారు. గురువారం తుళ్లూరులో నిర్వహించిన గ్రామపార్టీ సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న పార్టీ పదవులన్నీ రద్దయినందున కొత్త కమిటీల ఎంపిక నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో జరగనుందన్నారు. పదవులు ఎంపిక విషయంలో ఏకాభిప్రాయ నిర్ణయం ఉంటుంది.. కనుక కార్యకర్తలు నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబును సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. 21న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ గురువారం దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు. సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు వేయడానికి పూనుకుందని విమర్శించారు. ప్రధాని మోదీతో ఒప్పందం చేసుకున్న కారణంగా 2022, 2023లో విద్యుత్ వాడానికి ఇప్పుడు అదనపు చార్జీల పేరుతో ప్రజలనెత్తిన భారాలు వేయడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి.చిరంజీవి, సీపీఐ నాయకులు ఎస్కే కరిముల్లా, ఎం.వాసు, ఎం.రామకృష్ణ, వీరాంజనేయులు, శివయ్య, మౌలాలి, జాను, బాజీ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

తాడేపల్లిరూరల్ : కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. సీనియర్ నాయకుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తోందన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లి కృష్ణ, వేముల దుర్గారావు, కొట్టె కరుణాకర్, బి.దశరథరామిరెడ్డి, ఎస్కే బాష, ఎల్. సత్యం, దేవకుమార్, కె.మేరి, డీవీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూత్ నిరసన

ఫిరంగిపురం: పార్లమెంట్ సమావేశాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై బీఆర్ అంబేడ్కర్ యూత్ సభ్యులు గురువారం నిరసన తెలిపారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద యూత్ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మతోన్మాదం నశించాలంటూ, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. యూత్ సభ్యులు సీహెచ్ మోహన్‌బాబు, పి.మధుసూధనరావు, టి.పెద్ద లక్ష్మయ్య, జి.కోటేశ్వరరావు, జోజిబాబు, ఎస్,నాగరాజు, షేక్.మస్తాన్‌వలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ సుభాని

అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన

మంగళగిరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రం హోం మినిస్టర్ అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నిరసన తెలిపారు. నాయకులు షేక్ సలీమ్, రామనాథం పూర్ణ చంద్రరావు, గుజ్జర్లపూడి జాన్‌బాబు పాల్గొన్నారు.

అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు తగవు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేయడం తగదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని ఖండించారు. గురువారం దుగ్గిరాలలోని ఏఈఎల్ చర్చి పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులు దీనికి ఖండించాలన్నారు. అమిత్ షా తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ పెద్దేటి యోహాను పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కుట్టు మిషన్లు అందజేస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పాతూరులో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవినేని రజనీకాంత్ ట్రస్ట్ నిర్వాహకులు దేవినేని నిర్మల రజనీకాంత్ పాల్గొన్నారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం సుమారు రూ.45 వేలు విలువ గల రెండు కుట్టు మిషన్లు, ఒక గ్రైండ్, 9 మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులకు అందజేశారు. పాస్టర్లకు నూతన వస్త్రాలు బహూకరించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు కడియాల శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణం సుందరయ్య నగర్‌లో ఐద్వా, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు పాలు, సుధాకర్ మాట్లాడుతూ ప్రజలందరూ శాంతి సౌభ్రాతృత్వంతో కలసి మెలసి ఉండాలని క్రీస్తు బోధనలు తెలియజేస్తున్నాయని అన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. మాలకొండారెడ్డి ట్రస్ట్ కన్వీనర్ ఎస్. వెంకటరావు, ఐద్వా నాయకులు ఎస్.గిరిజ, ప్రజా నాట్యమండలి నాయకులు కొట్టే కరుణాకర్ రావు, ఎస్కే బాష, కె.ప్రభాకర్, కొండ బాబు, బేబీ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీలో తహసీల్దార్ గోపాలకృష్ణ, రోటరీ సభ్యులు

తెనాలి: రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు గురువారం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తోడ్పడాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ సేవకు, హైదరాబాద్‌లోని బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ సీఎస్సార్ నిధుల నుంచి ఆర్థికసహకారం అందజేసింది. రోటరీ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు వారి కాళ్ల మీద నిలబడి కుటుంబానికి అండగా ఉండాలనే భావనతో కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ లబ్ధిదారులను పరిచయం చేశారు. రోటరీ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నల్లూరి వెంకటేశ్వర్ రావు పర్యవేక్షించిన కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ దూళిపాళ్ల రవీంద్రనాథ్, సభ్యులు పావులూరి రాంబాబు, గుమ్మడి వెంకటనారాయణ, కొల్లి రాజేంద్రప్రసాద్, కాకుమాను ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, అర్జున్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.